క్లుప్తంగా

బీఎల్‌ఓలకు ప్రత్యేక శిక్షణ



మాగనూర్: మాగనూర్, కృష్ణ ఉమ్మడి మండలాల బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్స్‌కు స్థానిక ఇంచార్జి తహసీల్దార్ అమీర్ ఆధ్వర్యంలో ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని రైతువేదికలో నిర్వహించారు. ఈ సందర్భంగా డీటీ సురేష్, సాయినాథ్‌లు ప్రత్యేక ట్రైయినర్లుగా వ్యవహరించి బీఎల్‌ఓలు, సూపర్‌వైజర్స్‌కు ఫామ్6, ఫామ్7, ఫామ్ 8లపై అవగాహన కల్పించారు. ఓటర్ల జాబితా నమోదులో ఎలాంటి తప్పులు లేకుండా జాగ్రత్తగా చేపట్టాలని సూచించారు. 18ఏళ్ల నిండిన ప్రతిఒక్కరూ ఓటుహక్కు పొందేలా చూడాలని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌ఐ శ్రీశైలం, కృష్ణ ఆర్‌ఐ, బీఆర్‌ఏలు తదితరులు పాల్గొన్నారు.

ధూపదీప నైవేద్య మండల సంఘం ఎన్నిక



జంగం శరణయ్యస్వామి

దామరగిద్ద: దేవాదాయ శాఖ నిర్వహిస్తున్న ధూపదీప నైవేద్య పథకం అర్చక సంఘం మండల అధ్యక్షుడిగా జంగం శరణయ్య స్వామి ఎన్నికయ్యారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు వీరన్నస్వామి, జిల్లా కార్యదర్శి రవికుమార్ సమక్షంలో మండల కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా శరణయ్యస్వామి, కార్యదర్శిగా జంగం, మల్లికార్జున్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా మండల అర్చకసంఘం సభ్యులు అభినందనలు తెలియజేశారు.

రథయాత్ర వాల్‌పోస్టర్ విడుదల



నారాయణపేట రూరల్: సీపీఎస్ సాధనే లక్ష్యంగా రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహించతలపెట్టిన రథయాత్ర వాల్‌పోస్టర్‌ను శుక్రవారం మున్సిపల్, ఇరిగేషన్ కార్యాలయం ఎదుట విడుదల చేశారు. ఈ సందర్భంగా సీపీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు భాస్కర్‌రెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ, ఉపాధ్యాయులు సీపీఎస్ విధానంతో చాలా నష్టపోతున్నారని వాపోయారు. పాత పెన్షన్ విధానం అమలు చేయాలనే డిమాండ్‌తో గతంలో ఎన్నోరకాల ధర్నాలు, నిరసనలు తెలిపినా ప్రభుత్వం స్పందించలేదని విమర్శించారు. ఈ నెల 16న సీపీఎస్ సాధన సంకల్ప రథయాత్ర ప్రారంభమైందని, 29న నారాయణపేటకు చేరుకుంటుందన్నారు. జిల్లాలోని సీపీఎస్ ఉద్యోగ, ఉపాధ్యాయులు పూర్తి మద్దతు తెలిపి విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో శంకర్, శ్రీనివాస్, తిరుపతినాయక్, రాజగోపాల్, అనంతరెడ్డి, రాజునాయక్, దేవరాజ్, భవ్య, భీమమ్మ, అల్లాస్ హుస్సేన్, తిప్పన్న పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి



నారాయణపేట టౌన్: మొక్కలునాటి వాటిని సంరక్షించాల్సిన బాధ్యత మనందరిపై ఉందని మున్సిపల్ కమిషనర్ సునీత అన్నారు. శుక్రవారం పట్టణంలో డంపింగ్‌యార్డ్ రోడ్డుకు ఇరువైపులా హరితహారం మొక్కలను సిబ్బందిచే నాటించారు. మొక్కలను నీరందించి కాపాడి పర్యావరణ పరిరక్షణకు తమవంతుగా కృషిచేయాలని మున్సిపల్ కమిషనర్ కోరారు. కార్యక్రమంలో మున్సిపల్ అధికారులు, శానిటేషన్ సూపర్‌వైజర్ చెన్నకేశవులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

చిత్తరంజన్ మరణం తీరనిలోటు

నారాయణపేట రూరల్: సంగీత దర్శకుడు చిత్తరంజన్ మరణం కళాకారులకు తీరనిలోటని ఎస్పీబాలు ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మహిపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం పట్టణంలోని కార్యాలయంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. అనంతరం ఆయన చలనచిత్ర పరిశ్రమకు చేసినసేవలను గుర్తుచేసుకున్నారు. హైదరాబాద్ దూరదర్శన్‌లో డైరెక్టర్‌గా చక్కగా విధులు నిర్వహించారన్నారు. చిత్తరంజన్ స్వరపరిచిన పాటలను పాడి వినిపించారు. కార్యక్రమంలో నర్సింహులు, వసంత్, రామకృష్ణ పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

మరికల్: జిల్లాలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించాలని డీఈఓ బీసీ ఐక్యవేదిక ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు రాజు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాలలో విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను డీఈఓ దృష్టికి తీసుకురావడంకోసం ఫోన్ చేస్తే స్వీకరించడం లేదన్నారు. ఇంతకు జిల్లాలో డీఈవో ఉన్నా లేదా అనే అనుమానాలు వస్తున్నాయన్నారు. విద్యార్థులకు అందుబాటులో ఉండి సమస్యలను పరిష్కరించాలని ఆయన డిమాండ్ చేశారు.

వాగులకు జలకళ



అలుగుపారుతున్న బిజ్జారం చెక్ డ్యాం

- చెక్ డ్యాంలు నిండి ప్రవహించడంతో వాగులకు జలకళ
- అత్యధికంగా 10.7 సెం.మీ వర్షపాతం నమోదు

కోస్గి: మండలంలో గత మూడురోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండటంతోపాటు గురువారం రాత్రి భారీ వర్షం కురవడంతో ముశ్రీఫా, బిజ్జారం వాగుల్లో నిర్మించిన చెక్ డ్యాంలు అలుగుపారాయి. చెక్‌డ్యాంల నుంచి పెద్దఎత్తున వర్షం నీరు వస్తుండటంతో వాగుల్లో నీరునిలిచి వాగులకు జలకళ సంతరించుకుంది. ముశ్రీఫా వాగులో చెక్‌డ్యాం, బిజ్జారం వాగులో సైతం చెక్ డ్యాం నిండి గ్రామాలకు నిర్మించిన వంతెనల పైనుంచి నీరు ప్రవహిస్తుంది. గురువారం రాత్రి మండలంలో జిల్లాలోనే అత్యధికంగా 10.7 సెం.మీ వర్షం నమోదు కాగా ముంగిమళ్ల, కొత్తపల్లి, కడంపల్లి, బోగారం వాగులు నీటి ప్రవాహంతో ఆకట్టుకున్నాయి.

చెరువుల్లోకి చేరిన నీరు...

మండల పరిధిలో గురువారం రాత్రి కురిసిన వర్షానికి మండల పరిధిలోని చెరువుల్లోకి పెద్ద ఎత్తున నీరు చేరింది. కొన్ని చెరువులు నిండి అలుగు పారాయి. మాసాయపల్లి పరం చెరువు అలుగు పారింది.

మక్తల్: పట్టణంలో శుక్రవారం భారీవర్షాలతో ఎల్లమ్మకుంట, రహిమానీయ కాలనీల్లో, యాదవనగర్, కేశవనగర్‌లో రోడ్లపై నీరు నిలిచిఉండటంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బందులు పడ్డారు. హైదరాబాద్ రూట్‌కు వెళ్లే ఎస్‌బీఐ బ్యాంకు ఎదుట రోడ్డుపై నీరు నిలిచి బస్సులు రాకపోకలకు ఇబ్బందులు ఏర్పడ్డాయి. ఎల్లమ్మ కుంటలో నీరు జలమయంగా మారింది. మురుగు కాల్వలు నిండి చెత్తాచెదారం అడ్డంగా ఉండటంతో నీరు రోడ్లపై ప్రవహించింది.



మక్తల్‌లో ఇళ్ల మధ్యన వర్షపునీరు



మురుగు కాల్వను శుభ్రం చేయిస్తున్న కౌన్సిలర్

గణితం సబ్జెక్టు తొలగించడం సరికాదు



డీఐఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందిస్తున్న నాయకులు

నారాయణపేట రూరల్ : జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గణితం సబ్జెక్టును తొలగించడం సరికాదని పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సాయికుమార్ విమర్శించారు. శుక్రవారం స్థానిక డీఐఈఓ కార్యాలయంలో వినతిపత్రం అందించి మాట్లాడారు. 40సంవత్సరాల చరిత్ర కల్గిన పేట జీజేసీలో నాటినుంచి తెలుగు, ఉర్దూ మీడియంలో బోధన జరుగుతుందని, తాజాగా ఎంపీసీ గ్రూపులో గణితం సబ్జెక్టు తొలగించడం సరికాదన్నారు. గతంలో పనిచేసిన మ్యాథ్స్ లెక్చరర్‌ను తొలగించడంతోపాటు ఇటీవల ఇచ్చిన నోటిఫికేషన్‌లో గెస్ట్ ఫ్యాకల్టీ కింద గణితం బోధకుడి పోస్టు ఎందుకు చూయించలేదని ప్రశ్నించారు. వెంటనే ఆ పోస్టును పునరుద్ధరించి విద్యార్థులకు న్యాయం చేయాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు వెంకటేష్, మహిపాల్ తదితరులు పాల్గొన్నారు.

మురుగు నీటిని తొలగించాలి



కాలనీలో మురుగు నీటిని పరిశీలిస్తున్న కమిషనర్ శశిధర్

కోస్గి: ఎడతెరిపి లేనివర్షాల నేపథ్యంలో కాలనీల్లో నిలిచిన మురుగునీటిని ఎప్పటికప్పుడు తొలగించాలని మున్సిపల్ కమిషనర్ శశిధర్ సిబ్బందికి సూచించారు. శుక్రవారం మున్సిపాలిటీ పరిధిలోని పలు కాలనీల్లో ఆయన పర్యటించారు. ఆయా కాలనీల్లో నిండిన మురుగు కాల్వలు, పారిశుధ్యం పరిశీలించి పలు సూచనలు చేశారు. పట్టణంలోని సాయినగర్ కాలనీ, బృందావన్ కాలనీ, హన్‌మాన్‌నగర్ కాలనీ, సబ్‌స్టేషన్, బస్టాండ్ ఏరియా తదితర ప్రాంతాల్లో పర్యటించి ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

మండలంకోసం కొనసాగుతున్న దీక్షలు

నారాయణపేట రూరల్: మండలంలోని కోటకొండను మండలం చేయాలని కొనసాగుతున్న దీక్ష శుక్రవారంతో 73వరోజుకు చేరాయి. దీక్షలో బీజేపై ఎం నాయకులు చెన్నప్పయాదవ్ వారికి దండలు వేసి దీక్షలు ప్రారంభించి మాట్లాడారు.. అన్నిఅర్హతలు కల్గిన కోటకొండకు మండల ఏర్పాటులో అవకాశం దక్కకుండా బీఆర్‌ఎస్ నాయకులు అడ్డుపడుతున్నారని వాపోయారు. తెలంగాణ ఏర్పాటు తర్వాత పరిపాలన సౌలభ్యంకోసం జిల్లాలు, మండలాలు చేస్తామని సీఎం కేసీఆర్ ప్రకటించిన వెంటనే కోటకొండ గ్రామస్తులు ప్రతిపాదనలు పంపినా తెలంగాణ ప్రభుత్వం తిరస్కరించిందని విమర్శించారు. కార్యక్రమంలో ప్రవీణ్, రాజు, యాదగిరి, సలీం, రాములు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో మాట్లాడుతున్న చెన్నప్ప యాదవ్

రైతు బాంధవుడు కేసీఆర్



దామరగిద్ద: రైతుల కష్టాలను ఎరగని తెలంగాణ రైతుబిడ్డ సీఎం కేసీఆర్ రైతుబాంధవుడని ఎంపీపీ నర్సప్ప, జిల్లా రైతుబంధు సమితి అధ్యక్షుడు భీమయ్యగౌడ్, విండో అధ్యక్షుడు ఈదప్ప అన్నారు. శుక్రవారం మండలంలోని గడిమున్కన్‌పల్లి క్లస్టర్ లింగారెడ్డిపల్లి రైతువేదికలో పీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి వ్యవసాయానికి మూడుగంటల విద్యుత్ సరిపోతుందని రైతులపై వివక్షపూరితంగా మాట్లాడాన్ని నిరసిస్తూ ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కేసీఆర్ 24గంటలపాటు విద్యుత్‌ను అందించి రైతులు ఏటా మూడు పంటలు పండించుకునే స్థితికి తీసుకొచ్చారన్నారు. రైతులకు అందిస్తున్న రైతుబంధు, రైతుబీమా, రుణమాఫీ వంటి పథకాలతో రైతులు సంతోషంగా ఉండటాన్ని జీర్ణించుకోలేని కాంగ్రెస్ నాయకులు రైతులను అంధకారంలోని నెట్టేవిధంగా ప్రకటనలు చేయడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు మాజీ ఎంపీపీ, వెంకట్‌రెడ్డి, శరణప్ప, ఎంపీటీసీ లక్ష్మిరాంచదర్, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలి



ఓటరు జాబితాపై సూచనలు ఇస్తున్న ఆర్డీఓ

మరికల్: అర్హులైన వారందరిని ఓటరు జాబితాలో చేర్చేందుకు బీఎల్‌ఓలు ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఆర్డీఓ రామచందర్ అన్నారు. శుక్రవారం మండలంలో నిర్వహించిన బూత్‌స్థాయి అధికారుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఇంటింటి సర్వేలో వారి వివరాలు, బతుకు దెరువు నిమిత్తం వలస వెళ్లిన వారి వివరాలతోపాటు 17–18ఏళ్ల వయస్సు ఉన్న యువతి, యువకుల వివరాలు తమ వద్ద ఉండాలన్నారు. తప్పొప్పులు లేకుండా ఓటరు జాబితా ఉండాలన్నారు. కార్యక్రమంలో తహసిల్దార్ రాంకోటి, డీటీటీ శ్రీనివాస్, ఆర్‌ఐలు శ్రీశైలం, సురేందర్‌రెడ్డి పాల్గొన్నారు.

గుంతలు పడిన రోడ్డు



దామరగిద్ద: స్థానిక అంబేద్కర్ చౌరస్తా సమీపంలో గతవారం రోజుల క్రితం బీటీరోడ్డుకు మరమ్మతులు చేపట్టారు. నాసిరకంగా బీటీవేయడంతో కొద్దిరోజులకే రోడ్డుగుంతలు పడింది. రోడ్డు వేసే సమయంలో నాసిరకం మెటీరియల్ వాడుతున్నారని స్థానిక నాయకులు ఆర్‌అండ్‌బీ డీఈ రాములును ప్రశ్నించిన పట్టించుకోలేదని వాపోతున్నారు. ఎడతెరిపి లేని వర్షానికి రోడ్డు కోతకు గురవుతుందని ఉన్నతాధికారులు స్పందించి వెంటనే రోడ్డు మరమ్మతులు చేపట్టాలని కోరుతున్నారు.

గ్రామ పంచాయతీకి స్థలదానం



మక్తల్: మండలంలోని గుడిగండ్లలో పంచాయతీ నిర్మాణానికి రాష్ట్ర ట్రెడ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ దేవరి మల్లప్ప శుక్రవారం స్థలాన్ని దానం చేశారు. గ్రామ సమీపంలో ఉన్న సాయిరాం గ్రీన్‌సిటీలో 525 గజాల స్థలాన్ని పంచాయతీ నిర్మాణానికి ఉచితంగా అందజేయడంతో గ్రామస్తులు దేవరి మల్లప్పను అభినందించి శాలువాతో సన్మానించారు. స్థలానికి సంబంధించిన పత్రాలను సర్పంచ్ మహేశ్వరికి అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్‌మహేశ్వరి, ఉపసర్పంచ్ వెంకటేశ్వర్‌రెడ్డి, కిష్టప్ప, తిరుపతయ్య, పూజరి కుర్మయ్య, రాజు, బాలప్ప, లింగప్ప, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

ఖర్గేకు జన్మదిన శుభాకాంక్షలు



మక్తల్: ఏఐసీసీ మల్లికార్జున్ ఖర్గే జన్మదినం సందర్భంగా శుక్రవారం ఢిల్లీలో జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు వాకిటి శ్రీహరి మల్లికార్జున్ మర్యాదపూర్వకంగా కలిసి ఖర్గేకు పుష్పగుచ్ఛం అందజేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

విద్యుదాఘాతంతో ఎద్దు మృతి



కృష్ణా: మండంలోని మురహర్‌దొడ్డిలో శుక్రవారం సాయంత్రం పొలంలో గడ్డి మేస్తూ పక్కనే ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగలడంతో ఎద్దుమృతి చెందింది. ఇందుకు సంబంధించిన వివరాలు.. గతవారంరోజుల క్రితం లక్షా 40వేలతో రెండు ఎద్దులను గ్రామానికి చెందిన దేవేంద్రప్ప కొనుగోలు చేశాడు. ప్రమాదవశాత్తు ఎద్దు విద్యుదాఘాతానికి గురై మృతి చెందడంతో బాధిత రైతు ఆవేదన వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యేను కలిసిన ముదిరాజ్ సంఘం నాయకులు



మక్తల్: ముదిరాజ్ సంఘం నాయకులు శుక్రవారం ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డిని కలిశారు. పండుగ సాయన్న జయంతి సందర్భంగా నియోజకవర్గ కేంద్రంలో నిర్వహించనున్న విగ్రహ ఏర్పాటు భూమిపూజ కార్యక్రమానికి రావాలని ఆహ్వానించారు. కార్యక్రమంలో జిల్లా మత్స్యకార సంఘం జిల్లా చైర్మన్ కోళ్ల వెంకటేష్, నాయకులు కావలి శ్రీహరి, అంజయ్యాచారి, శేఖర్, లక్ష్మన్, కిష్టప్ప, శ్యామ్, గోపి, పృథ్వీరాజ్, ఆంజనేయులు, శివకుమార్, గోవర్ధన్ తదితరులు పాల్గొన్నారు.

శిథిలావస్థలో వాటర్ ట్యాంకు



అమరచింత: పట్టణంలోని మిషన్ భగీరథ ఓవర్ హెడ్ ట్యాంకు శిథిలావస్థకు చేరువలో ఉంది. స్థానిక దళమి కట్ట వద్ద ఉన్న ఓవర్ హెడ్ ట్యాంక్ ద్వారా ప్రతి నిత్యం ఓవర్ ఫ్లో ద్వారా తాగునీరు వృథాగా పారుతున్నా సంబంధిత అధికారులు పట్టించుకోవట్లేదు. దీంతో ట్యాంకు లోంచి నీరు రోడ్లపై పారుతుండటంతో రహదారులు దెబ్బతింటున్నాయి. విషయాన్ని మున్సిపల్ అధికారులకు, పాలక వర్గానికి తెలిసిన అరికట్ట లేకపోతున్నారు. స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల, దళమి కట్ట వద్ద ప్రతినిత్యం నీటి వృథా జరుగుతున్నా మిషన్ భగీరథ అధికారులు, వాటర్ లైన్‌మెన్లు నిమ్మకునీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి నీటి వృథాను అరికట్టాలని కోరుతున్నారు.

అధికారులు నిర్లక్ష్యవైఖరి వీడాలి



సమావేశంలో ప్రగతి నివేదికను చదివి వినిపిస్తున్న ఫారెస్టు అధికారి నిలేష్

- ఎంపీపీ శ్యామలమ్మ

మాగనూర్: మండల పరిషత్ అధికారులు నిర్లక్ష్యం వీడాలని ఎంపీపీ శ్యామలమ్మ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఎంపీడీఓ సమావేశంలో ఎంపీపీ శ్యామలమ్మ అధ్యక్షతన మండల సమావేశాన్ని నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి రావాల్సి ఉండగా ఇతర పనుల నిమిత్తం సమావేశానికి హాజరుకాలేకపోయారు. దీంతో ఎంపీపీ ఆధ్వర్యంలో సభను కొనసాగించిన అధికారులు వివిధ శాఖల అధికారులు, మండల ప్రజాప్రతినిధులు పాల్గొని నివేదికను సభ్యులకు చదివి వినిపించారు. ఈ సందర్భంగా ఫారెస్టు అధికారి నిలేష్ ప్రగతి నివేదిక వినిపిస్తుండగా ఎంపీడీవో కార్యాలయ అవరణలో చెట్లను నరికివేశారని, వీటికి అనుమతులు ఏ విధంగా ఇచ్చారని ఎంపీపీ ప్రశ్నించారు. అధికారులు ఆన్‌లైన్‌లో అనుమతులు తీసుకున్నట్లు ఆయన వివరించారు. దీంతో ఎంపీపీ ఆగ్రహం వ్యక్తం చేశారు. కనీసం తనకు సమాచారం ఇవ్వకుండా విలువైన మొక్కలను సెలవు దినాలలో నరికి తరలించడం ఎంతవరకు కరెక్టు అని అన్నారు. స్పందించిన ఎంపీడీఓ సుధాకర్‌రెడ్డి సమాధానం చెప్పే ప్రయత్నం చేసిన వైస్‌ఎంపీపీ తిప్పయ్య, ఎంపీపీ ప్రశ్నల వర్షం కురిపించారు. దీంతో కొంతసేపు సమావేశం గందరగోళంగా మారడంతో జెడ్పీటీసీ వెంకటయ్య కలుగజేసుకుని ఇరువురికి సర్దిచెప్పి సమస్యను సర్దుమణిగించారు. హార్టికల్చర్ అధికారి దేవప్రసాద్ మాట్లాడుతూ.. రైతులు ఆయిల్‌ఫామ్ సాగుపై ముందుకు రావాలని, ప్రస్తుతం ఇతర దేశాల నుంచి సంవత్సరానికి 2 లక్షల కోట్ల ఆయిల్‌ఫామ్ కొనుగోలు చేస్తున్నామని తెలిపారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో సీజనల్ వ్యాధులు ప్రభలే అవకాశాలు ఉన్నాయి. ఎటువంటి జాగ్రత్తలు పాటిస్తారని నేరడగం గ్రామసర్పంచ్ అశోక్‌గౌడ్ మండల వైద్యాధికారిణి వెంకటరమణమ్మ అడగగా.. ఇప్పటికే అవగాహన మొదలు పెట్టామని, ప్రతి శుక్రవారం ఆశకార్యకర్త డ్రైడే నిర్వహిస్తున్నామని తెలిపారు. మనఊరు–మన బడికింద చేపట్టిన పనులకు రికార్డులు చేయడం లేదని, ఇప్పటికే దాదాపుగా 25 లక్షల వరకు పనులు చేపట్టామని సంబంధిత ఏఈను సంప్రదిస్తుంటే సరైన సమాధానం రావడం లేదని వడ్వాట్ ఎంపీటీసీ సుదర్శన్‌గౌడ్, ఎంపీడీఓను అడుగగా ఉన్నతాధికారులు దృష్టికి తీసుకువెళ్తానని వివరించారు. కొల్పూర్ చెరువు కట్టపై గత ఆరు నెలలుగా విద్యుత్ సమస్య నెలకొన్న పరిష్కారానికి నోచుకోవడం లేదని విద్యుత్ ఇంచార్జి ఏఈ చేతన్‌ను జెడ్పీటీసీ వెంకటయ్య అడగగా.. త్వరలోనే సమస్య పరిష్కారిస్తామని సమాధానం తెలిపారు. పశువుల షెడ్లు ఏవి అని ఏపీఓను నెరడగం సర్పంచ్ ఆశోక్‌గౌడ్ ప్రశ్నించారు. దీంతో నిర్మాణాలు జరుగుతున్నాయని ఏపీఓ సత్యప్రకాష్ తెలిపారు. విషపు పురుగులు ఇళ్లలోకి వచ్చి ప్రజలు ప్రమాదాల బారిన పడుతున్నారని నెరడగం సర్పంచ్ ఎంపీడీఓను అడిగారు.. కనీసం పంచాయతీ నుంచి వేస్తామంటే కూడా అనుమతులు ఇవ్వకపోవడం ఏమిటని గ్రామాలు మొత్తం అంధకారంలో ఉన్నాయని తెలుపుగా , ఉన్నత అధికారుల నుంచి ఆదేశాలు లేవని ఎంపీడీఓ సమాధానం ఇచ్చారు. సింగిల్ విండో చైర్మన్ వెంకట్‌రెడ్డి, ఎంపీటీసీలు ఎల్లారెడ్డి, శామలమ్మ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మ దహనం

నారాయణపేట టౌన్: మణిపూర్‌లో అమ్మాయిలని నగ్నంగా ఊరేగించి గ్యాంగ్‌రేప్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేస్తూ పీవోడబ్ల్యూ రాష్ట్రకమిటీ పిలుపు మేరకు జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో ప్రధాని మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మలను దహనం చేశారు. ఈ సందర్భంగా పీవోడబ్ల్యూ రాష్ట్ర సహాయ కార్యదర్శి విజయలక్ష్మి మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరుగుతున్న దారుణాల్లో ఒక్కొక్కటిగా వెలుగులో వస్తున్నాయని, కుకీ తెగకు చెందిన ముగ్గురు మహిళలను నగ్నంగా ఊరేగించి, సామూహిక హత్యాచారానికి పాల్పడి, వారిలో ఇద్దరిని హతమార్చిన యుద్ధాంతం వెలుగులోకి వచ్చిన విషయం ప్రభుత్వానికి తెలిసిన ఈ సంఘటనపై ఎలాంటి స్పందన లేదన్నారు. అమ్మాయిలకు రక్షణ కల్పిస్తున్నామంటూనే అతికిరాతంగా జరిగిన కేంద్రప్రభుత్వం పట్టించుకోకపోవడం సిగ్గుచేటు అన్నారు. మణిపూర్‌లో జరిగిన సంఘటనకు పూర్తిబాధ్యత నరేంద్రమోదీ, అమిత్ షానే వహించాలని డిమాండ్‌చేశారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షురాలు లక్ష్మి, పట్టణ అధ్యక్షురాలు సునీత, నాయకులు భాగ్యలక్ష్మి, రాధమ్మ, అరుణ, లక్ష్మి, నాగమ్మ, గజలమ్మ తదితరులు పాల్గొన్నారు.

మక్తల్: మణిపూర్ రాష్ట్రంలో మహిళలను నగ్నంగా ఊరేగించి హత్య చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో పట్టణంలో శుక్రవారం రాస్తారోకో నిర్వహించారు. దేశంలో మహిళలకు రక్షణ లేకుండా పోయిందని స్వేచ్ఛగా తిరగడంలేదన్నారు. హత్యచారాలు, వేదింపులు అధికమవుతున్నాయని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. అనంతరం కేంద్ర ప్రభుత్వ దిష్టిబొమ్మను దహనం చేశారు. కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం ఉన్న గొడవలను సద్దుమణిగించడంలో పూర్తిగా విఫలమైందన్నారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి భాస్కర్, ఉపాధ్యక్షురాలు సంధ్య, పృథ్వీరాజ్, రేణుక, సౌజన్య, పౌర్ణిమ, కీర్తి, శేఖర్ తదితరులు పాల్గొన్నారు.



దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

ఊట్కూరు: మణిపూర్‌లో అమ్మాయిలని నగ్నంగా ఊరేగించి గ్యాంగ్‌రేప్ చేసిన నిందితులను కఠినంగా శిక్షించాలని పీడీఎస్‌యూ జిల్లా ఉపాధ్యక్షుడు సిద్దు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం బిజ్వార్‌లోని శ్రామిక భవనంలో విలేకరులతో మాట్లాడుతూ.. మణిపూర్‌లో జరుగుతున్న దారుణాల్లో ఒక్కొక్కటిగా వెలుగులో వస్తున్నాయని, కుకీ తెగకు చెందిన ముగ్గురు మహిళాలను నగ్నంగా ఊరేగించి, సామూహిక అత్యాచారానికి పాల్పడి హతమార్చిన దుండగులను కఠినంగా శిక్షించాలన్నారు. ఇలాంటి సంఘటనలు ప్రజలు, ప్రజాస్వామికవాదులు, మేధావులు ముక్తకంఠంతో ఖండించాలని కోరారు. సర్పంచ్ సావిత్రమ్మ, ఎంపీటీసీ హన్మంతమ్మ, నాయకులు అనసూయ, అరుణ, అనీల్ పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె



నారాయణపేటలో ఒంటికాలుపై నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు



ఎంపీడీఓ కార్యాలయం వద్ద సమ్మె చేస్తున్న కార్మికులు

నారాయణపేట రూరల్ : పంచాయతీ కార్మికులు శుక్రవారం ఒంటికాలిపై నిల్చుని వినూతన్నంగా నిరసన వ్యక్తం చేశారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట 16వరోజు సమ్మె కొనసాగించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకులు బలరాం మాట్లాడుతూ.. బీఆర్‌ఎస్ ప్రభుత్వం కార్మికులపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందని విమర్శించారు. జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. మృతిచెందిన కార్మికుల కుటుంబాలకు రూ.25లక్షల ఎక్స్‌గ్రేషియా అందించాలని కోరారు. కార్యక్రమంలో వెంకటయ్య, రవి, నాయకులు రామచందర్, హన్మంతు, రవి, వెంకటేష్, రాజు, రాయప్ప, చంద్రమౌళి, భీమప్ప, భగవంతు, బాలరాజు పాల్గొన్నారు.

మక్తల్: పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఎంపీడీఓ కార్యాలయం వద్ద చేపట్టిన సమ్మె శుక్రవారంతో 16రోజుకు చేరింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. కార్మికులకు జీఓ 60 ప్రకారం కార్మికుల వేతనాలు పెంచాలని, మల్టీపర్పస్ విధానాన్ని రద్దుచేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో జిల్లా ఇఫ్టూ అధ్యక్షుడు కిరణ్, వెంకటేష్, భగవంతు, రాంచంద్రి, నర్సింహ, నారాయయణ, శ్రీనివాసులు, కిష్టప్ప, నరేష్, సాయన్న, నర్సప్ప, రాజు, ఆంజనేయులు, రాములు, బాల్‌రాజు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99516 02829
మహబూబ్‌నగర్ జిల్లా: 90102 34478, 90105 22215, 97051 35557, 90108 69797, జడ్చర్ల: 90100 76222
నాగర్‌కర్నూల్ జిల్లా: 90100 06785
వనపర్తి జిల్లా: 90100 68317
జోగులాంబ గద్వాల జిల్లా: 95539 55603
నారాయణపేట జిల్లా: 90109 62007
Office mail : advtmbnr@gmail.com